క్లుప్తంగా

శబరికి అయ్యప్ప స్వాములు



శబరికి బయలుదేరిన స్వాములు

లోకేశ్వరం: కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు కేరళలోని శబరిమలకు శనివారం ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. గ్రామంలోని హనుమాన్ మందిరంలో గురుస్వామి ప్రత్యేక పూజలను నిర్వహించి అయ్యప్ప మాధారణ చేసిన స్వాములకు ఇరుముడి కట్టారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయం మారుమోగింది.

ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

తలమడుగు: ఈనెల 26 నుంచి గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని భరంపూర్‌లో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ప్రకాష్ రావు, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ప్రతాప్, రమేశ్‌రెడ్డి, రఫీక్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఈనెల 22న గోదావరిఖనిలో నిర్వహించే నేతకాని మహార్ ఆత్మీయ సమ్మేళనం సభ పోస్టర్‌ను జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ శనివారం ఆవిష్కరించారు. సభకు నేతకానీలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మహేందర్, గంగేశ్, జాడి కేశవ్, రవికాంత్ పాల్గొన్నారు.

వాల్గొండలో కబడ్డీ పోటీలు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండలో సంక్రాంతి పండుగను పురష్కరించుకొని శనివారం ఏకలవ్య ఫౌండేషన్, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో తొమ్మిది జట్లు పాల్గొన్నాయి. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కినక జుగాదిరావ్, గ్రామ పటేల్ కినక లచ్చు, ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ పుద్దురు ముత్యం, కోఆర్డినేటర్ పెందోర్ శంకర్ పాల్గొన్నారు.

మన ఊరు.. మన బడి పనులు పూర్తి చేయాలి

నార్నూర్: మన ఊరు.. మన బడి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పనులను పూర్తి చేయాలని కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించి వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



నేరడిగొండ: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి క్రీడాకారులను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంధం నవీన్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, గాదె శంకర్, వీడీసీ అధ్యక్షుడు చంద్రోఖర్, రాం రాజేశ్వర్, పోశెట్టి పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గొల్లఘాట్ గ్రామాన్ని సందర్శించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మెస్రం జంగుబాపు మాట్లాడుతూ.. మట్టి రోడ్డుపై వెళ్లేందుకు గ్రామస్తులు పడుతున్నారని, అధికారులు విన్నవించినా.. పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సృజన్, భీంపూర్ మండల అధ్యక్షుడు ఛత్రపతి, అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు



సారంగపూర్: అలేఖ్యకు బహుమతి అందిస్తున్న చైర్మన్ చందు



భైంసాటౌన్: . విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

లోకేశ్వరం: సంక్రాంతి సంబురాల్లో భోగబాగ్యాలను అందించే పండుగ. సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింభించే విధంగా ఈ పండుగను నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి పండుగ భోగితోనే ప్రారంభం కానుంది. ఈరోజు చిన్నారులకు భోగి పండ్లు పోయడంతో వారి మీద ఏమైనా పీడ ఉంటే వదులుతుందని ప్రజల విశ్వాసం. శనివారం రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద భోగి మంటలు ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా మండల కేంద్రలోని వివిధ ప్రాంతాల్లో రేగు పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. కిలో రూ.80 అమ్ముతున్నారు.

భోగి వేడుకలు..

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకొని ఇంటి ఆడపడుచులు ఉదయాన్నే ఇంటి ముందు కల్లాపి చల్లీ రంగురంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను ఉంచి, రేగు పండ్లు, జీడిపండ్లు, చెరుకు గడలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు రకాల పిండి వంటకాలను చేసుకున్నారు. రైతుల పంట నుండి వచ్చిన నూతన ధాన్యంతో పిండి వంటకాలు తయారు చేశారు. అనంతరం యువకులు గాలిపటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు బోగిపండ్లు పోశారు.

ముగ్గుల పోటీలు

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్ మున్నూరు కాపు సంఘ భవనంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన పోటీలకు మహిళలు అధిక సంఖ్యలోనే పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వర్, రావుల పోశెట్టి, కాశీనాథ్, పోశెట్టి, తదితరులున్నారు.

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ దేవాలయం ప్రాంగణంలో శనివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల పాఠశాలల విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఏ. అలేఖ్య ప్రథమ, ఏ రాజేందర్ ద్వితీయ, శైలు తృతీయ స్థానంలో నిలువగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ధర్మకర్త పురుషోత్తం రావు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు బహుమతలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్.ఏ బుచ్చన్న, పరిచారక శ్రీనివాస శర్మ, పాచకులు తుమ్మ సాయన్న, లక్ష్మణ్, ఉన్నారు.

గ్రామాల్లో సందడి

ముథోల్: ముథోల్ నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగను పురష్కరించుకొని ప్రజల కొనగోళ్లతో మార్కెట్‌లో సందడిగా మారింది. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీజీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్, బీజేపీ నాయకులు రామరావుపటేల్, మోహన్ రావుపటేల్, జెడ్పీటీసీ సరోజినిరెడ్డి, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, ముథోల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాజేందర్, ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



లక్ష్మణచాందా: చిన్నారికి భోగిపండ్లు పోస్తూ..



లోకేశ్వరం: చకినాల తయారీలో మహిళలు



సంక్రాంతి ముగ్గులు వేస్తున్న చిన్నారులు

అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కద్తాల్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కద్తాల్ గ్రామంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొట్టమొదటి అయ్యప్ప ఆలయం కాగా అయ్యప్ప నామస్మరణ, శరణుగోషతో పులకించింది .ఆలయంలో సంక్రాంతి వేడుకలను వైభవంగా చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం, అలంకార ప్రియుడైన స్వామికి విశేష పూజలు చేశారు. రంగురంగుల పూలతో అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆభరణాలను గ్రామంలోని ప్రధాన వీధులల్లో ఊరేగించారు. అనంతరం ఆభారణాలను స్వామి వారికి అలంకరించారు. ఉమ్మడి జిల్లాలోనే మొదటి అయ్యప్ప ఆలయం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మణికంఠుణ్ణి దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ గురు స్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో శ్రీధర్మ శాస్త్ర ట్రస్టు సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కర్పూర మకర జ్యోతిని దర్శించుకున్న భక్తులు

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో కర్పూర మకర జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. శనివారం రాత్రి శభరిమలై అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతి వెలిగిన సమయంలోనే ఇక్కడ కద్తాల్ అయ్యప్ప ఆలయంలో కర్పూర మకర జ్యోతి వెలిగించారు. దీంతో భక్తులు కర్పూర మకర జ్యోతిని దర్శించుకొని స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు తన్మయత్వం పొందారు. ఆలయ గురు స్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయంలో వెలుగుతున్న కర్పూర మకరజ్యోతి

ఘనంగా గోదారంగనాథుల కల్యాణం



పూజల్లో పాల్గొన్న సీఐ అజయ్‌బాబు దంపతులు



పారాయణంలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో శ్రీగోదా రంగనాథుల కల్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విష్ణుసహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు. అనంతరం పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. సీఐ అజయ్‌బాబు దంపతులు హాజరై పూజలు చేశారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

నిర్మల్‌ఖైగేట్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకమని నిర్మల్ టౌన్ సీఐ శ్రీనివాస్ అన్నారు. కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా ప్రియదర్శిని నగర్‌లో సీసీటీవీ, సైబర్ నేరాలపై ఆయన శనివారం కాలనీవాసులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుర్తు తెలియని కాల్స్, ఏవైనా లింక్స్ ఎవరైనా పంపిస్తే దాని పైన క్లిక్ చేసి దానికి రెస్పాన్స్ అవ్వకూడదన్నారు. బ్యాంక్‌కు సంబంధించి ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వకూడదన్నారు. ప్రతి ఇంటిలో, ముఖ్యమైన కూడలలో సీసీటీవీలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే డయల్ 100 పోలీసులకు తప్పకుండా సమాచారం అందించాలని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, వాహనదారులు వారి వెంట తప్పనిసరిగా వాహన ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

అటెన్షన్ ప్లీజ్.. రహదారి మరమ్మతు చేయండి



తానూరు: కోలూరు గ్రామం నుంచి మొగ్లి గ్రామానికి ఉన్న బీటీ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురువుతున్నారు. రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఉండడంతో వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: జగదీష్, పీఆర్ ఏఈ, ఫోన్ : 94408 36125

రోడ్ల సంరక్షణ మన అందరి బాధ్యత

- ఎస్సై రాహుల్ గైక్వాడ్
- కేజీవీల్ ట్రాక్టర్ యజమానులతో సమావేశం



మాట్లాడుతున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్

లక్ష్మణచాంద: రోడ్ల సంరక్షణ మన అందరి బాధ్యతని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. శనివారం లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన కేజీవీల్ ట్రాక్టర్ల యజమానులతో సర్పంచ్ ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేజీవీల్ ట్రాక్టర్ల యజమానులు అంటే పోలీసులకు ఎటువంటి వైరుధ్యం లేదన్నారు. రోడ్లను కాపాడుకోవడం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే తాము చర్యలు చేపడుతున్నామన్నారు. తమ మండల ప్రజల సుఖమయ ప్రయాణం కోసం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం వేసిన రోడ్లను కాపాడుకోవడం మండల ప్రజల అందరి బాధ్యతని తెలిపారు. కేజీవీల్ ట్రాక్టర్ యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు. రోడ్లను కాపాడుకుంటూ మీ పనులు చేసుకోవాలన్నారు. అనంతరం సర్పంచ్ ముత్యం రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణచాంద కేజీవీల్ ట్రాక్టర్ యజమానులు రోడ్లు పాడుకాకుండా ఉండటం కోసం కేజీవీల్ ట్రాక్టర్లకు ఇనుప తొడుగులు తయారు చేయించామన్నారు. అలాగే మండల కేంద్రంలోని కేజీవీల్ ట్రాక్టర్లు ఒకచోటి నుండి మరో చోటికి తరలించడానికి నాలుగు ట్రాలీలు ఉన్నాయన్నారు. దీనిని పోలీసులు గమనించి తమకు సహకరించాలన్నారు.

పెంబిలో ముగిసిన పీపీఎల్ క్రికెట్ లీగ్



గెలిచిన మొదటి, ద్వితీయ జట్లకు బహుమతులు అందిస్తున్న శ్యాంనాయక్, నాయకులు

- విజేతగా పవర్ హిట్టర్స్

పెంబి: మండల కేంద్రంలో ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన పెంబి ప్రీమియర్ క్రికెట్ లీగ్ (పీపీఎల్) పోటీలు ఉత్కంఠంగా సాగాయి. శనివారం ఫైనల్ మ్యాచ్‌లో రెయిన్‌బో వారియర్స్, పవర్ హిట్టర్స్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా.. పవర్ హిట్టర్స్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.20వేలు, షీల్డు, రెండో బహుమతిగా రూ.10వేలు, షీల్డ్ అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, నిర్వాహకులు మల్లేశ్, నరేశ్, మతీన్, ఇస్మాయిల్ ఉన్నారు.



విజేతగా నిలిచిన పవర్ హిట్టర్ జట్టు

మొక్కజొన్న సాగుకు రైతుల మొగ్గు

- ఖరీఫ్ నష్టాన్ని పూడ్చుకునేందుకే
- పెట్టుబడి తక్కువ కావడంతో ఆసక్తి
- బావుల్లో పెరిగిన నీటిమట్టం



లోకేశ్వరం: ప్రకృతిపై ఆధారపడి చేసే వ్యవసాయంలో ఏటా ఏదో రకంగా రైతు నష్టాలపాలవుతూనే ఉన్నాడు. ఖరీఫ్‌లో వేసిన పంట పోతే యాసంగి పంటతోనైనా గట్టెక్కవచ్చని ఆశపడుతుంటాడు. నిర్మల్ జిల్లాలో వరి పంటతో పాటు మొక్కజొన్న పంటలు సాగు చేసినా అతివృష్టి కారణంగా తీరని నష్టాలను మిగిల్చింది. దీనిని పూడ్చుకునేందుకు యాసంగిలో మొక్కజొన్న సాగుకు సమాయత్తమైనారు. దీంతో జిల్లాలో 38 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఆదుకోని ఇతర పంటలు ...

జిల్లాలోని రైతులు యాసంగిలో ఇతర పంటల కంటే మొక్కజొన్న సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. వరితో పాటు ఇతర పంటలైన పసుపు, కంది, పత్తి పంట సైతం నష్టాలకు గురిచేస్తోందని వాపోతున్నారు. పసుపు పంట వేస్తే ఏడాది పొడుగునా పనులు చేయాల్సి ఉంటుందని, పత్తి పంట సైతం నష్టాలకుగురిచేస్తోందని అంటున్నారు. దీంతో మొక్కజొన్న సాగే సరైందని అంటున్నారు.

సాగు వ్యయం తక్కువ..

మొక్కజొన్న పంట సాగుకు కూలీల అవసరం లేకపోవడంతో ఖర్చు ఎక్కువ ఉండదు.విత్తనం నాటే దగ్గర నుంచి పంట తీసే వరకు యంత్రాలతోనే పనులు చేయిస్తుండడంతో వ్యయం తక్కువ అవుతుంది.పెట్టుబడి కూడా తక్కువగా ఉండడం రైతులకు కలిసి వస్తోంది.పంటకు నీటి తడులు తగ్గినా.. ఇబ్బంది లేకండా పంట చేతికందుతుండడంతో మొక్కజొన్న సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు.

నష్టం తక్కువగా ఉంటుంది



యాసంగిలో మొక్కజొన్న పంట సాగుచేస్తా వర్షాకాలంలో వేసిన పంట నీట మునిగి పాడైంది.బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉంది.చుట్టే పక్కల రైతులు కూడా ఇదే సాగుచేస్తాం అంటున్నారు.ఇప్పుడు మొక్కజొన్న వేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- ప్రవీణ్, రైతు

మొక్కజొన్న సాగు చేస్తున్న



వానాకాలంలో సోయా బీన్, పత్తి పంటలు వేసినా అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్న. సరిపడా నీటి వసతి ఉంది కాబట్టి నిశ్చితంగా పంట వేశాను.

- లింగన్న, రైతు

అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు



బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కానిందే రాజారాం, పట్టణ అధ్యక్షుడు చట్ల జగదీష్, ఉత్తం, కుర్మే లక్ష్మణ్, అక్షయ్ కుమార్ పాల్గొన్నారు.